# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పేదలకు సేవ చేసేందుకు వైద్య విద్యార్థులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ భారత్ – జర్మనీ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు పలు అవగాహన ఒప్పందాలను చేసుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ సుప్రీం కోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నాను నియమిస్తూ.. ఉత్తర్వులు జారీ అయ్యాయి.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారం కానుంది.

=========================

పేదలకు సేవ చేసేందుకు వైద్య విద్యార్థులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సంక్షేమం కోసం అత్యాధునిక వైద్య విధానాలను ఉపయోగించాలని ఆమె అన్నారు. రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ - ఎయిమ్స్ కాన్వొకేషన్ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగిస్తూ.... గత 10 సంవత్సరాల్లో దేశ ప్రజలకు సార్వత్రిక ఆరోగ్య సేవలను అందించేందుకు అనేక చర్యలు చేపట్టామని అన్నారు.

(వాయిస్ 37 సెకన్లు)

ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ఈరోజు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - NIT రాయ్‌పూర్ 14వ స్నాతకోత్సవంలో పాల్గొని, రేపు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ – IIT, హెల్త్ సైన్స్ ఆయుష్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొంటారు.

=========================

నైపుణ్యం కలిగిన భారతీయుల కోసం వార్షిక వీసా కోటాను 20 వేల నుంచి 90 వేలకు పెంచాలని జర్మనీ నిర్ణయించింందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన 18వ ఏసియా పసిఫిక్ కాన్ఫరెన్స్ ఆఫ్ జర్మన్ బిజినెస్ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... భారతీయ నిపుణులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు పెరుగడంతో పాటు, భారత్ – జర్మనీ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు బలోపేతం చేయడంలో వీసాల పెంపు నిర్ణయం దోహదపడుతుందన్నరు. ప్రతిభ, సాంకేతికత, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు భారతదేశ వృద్ధికి సాధనాలు అని పేర్కొన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు ఇండో-పసిఫిక్ ప్రాంతం ఎంతో ముఖ్యమైనదని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

ఈ సందర్భంగ భారత్ - జర్మనీ దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంచే దిశగా ఇరు దేశాలు ఇండో-జర్మన్ గ్రీన్ హైడ్రోజన్, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణ రంగాలలో సహకారం వంటి పలు ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

=========================

సుప్రీం కోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమిస్తున్నట్టు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. జస్టిస్ ఖన్నా ప్రస్తుతం సుప్రీం కోర్టులో రెండవ అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. తన పదవీ కాలం నవంబరు 10న ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుత సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును సిఫార్సు చేశారు. ఇందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలియజేశారు. నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నవంబరు 11న ప్రమాణం చేయనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. జనవరి 18, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన సంజీవ్ ఖన్నా, 2025 మే 13 వరకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతారు.

విరామం

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 115వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

=========================

ఇజ్రాయెల్ - హమాస్ ల మధ్య యుద్ధ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ ఈరోజు గాజాపై చేసిన దాడుల్లో 38 మంది ప్రాణాలు కోల్పోయారని గాజా అధికారులు వెల్లడించారు. మరోవైపు హెజ్‌బొల్లా లక్ష్యంగా దక్షిణ లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ దాడులు చేసింది. జర్నలిస్టుల అతిథి గృహాలపై బాంబులు వేయడంతో ముగ్గురు పాత్రికేయులు ప్రాణాలు కోల్పోయరని లెబనాన్ ప్రభుత్వం వెల్లడించింది. దాడులకు ముందు ఇజ్రాయెల్ ఎలాంటి హెచ్చరికలు చేయలేదని పేర్కొంది. మరోవైపు ఇరువర్గాలు సంధి ఒప్పందానికి వస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో తమ స్పై చీఫ్ పాల్గొంటున్నారని ఇజ్రాయెల్ పేర్కొంది. ఒప్పందం కుదిరితే పోరాటం ఆపేస్తామని హమాస్ వర్గాలు సైతం వెల్లడించాయి.

=========================

ఝార్ఖండ్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు గడువు ఈరోజుతో ముగిసింది. ఈ దశలో 43 నియోజకవర్గాలకు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది. ఇప్పటి వరకు 748 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అక్టోబరు 28న నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 30న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది.

ఇదిలావుండగా, అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన సోదాల్లో 27 కోట్ల రూపాయల విలువైన అక్రమ సామగ్రి, నగదు స్వాధీనం చేసుకున్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు 14 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

=========================

సుప్రీంకోర్టు గత 75 సంవత్సరాలుగా ప్రజా కోర్టుగా రూపుదిద్దుకుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్ అన్నారు. ఈరోజు సుప్రీంకోర్టు 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆకాశవాణికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాన న్యాయమూర్తి వివిధ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణిలో వ్యాఖ్యాతగా పని చేసిన రోజులను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈరోజు రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ఆకాశవాణి గోల్డ్, అదనపు ఫ్రీక్వెన్సీలలో ఈ ఇంటర్వ్యూ ప్రసారం చేయబడుతుంది. అలాగే newsonair.gov.in వెబ్‌సైట్‌లో అన్ని సామాజిక మధ్యమాలలో అందుబాటులో ఉంటుంది.

=========================

తూర్పు లద్దాఖ్‌లోని కీలకప్రాంతాలైన డెమ్చోక్, డెస్పాంగ్ ల నుంచి భారత్, చైనా బలగాలు వెనక్కి మరలుతున్నారని భారత రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. భారత్ - చైనాల మధ్య వాస్తవాధీన రేఖ (LAC) వెంబడి గత సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇటీవల ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందం జరిగాయి. ఒప్పందం ప్రకారం సరిహద్దుల్లో బలగాల ఉపసంహరణ ప్రక్రియ మొదలైందని, సైనిక సామగ్రి, ఇతర పరికరాలను వెనక్కి తీసుకొస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక్కడి టెంట్లు, తాత్కాలిక నిర్మాణాలను కూడా ఇరుదేశాల బలగాలు తొలగిస్తున్నట్లు వెల్లడించారు. చార్డింగ్ లా పాస్‌కు సమీపంలోని నదికి పశ్చిమదిశగా భారత బలగాలు, తూర్పు దిశగా చైనా బలగాలు వెనక్కివెళ్తున్నట్లు పేర్కొన్నారు.

=========================

దేశ రాజధానితో సహా వివిధ ప్రాంతాల్లో వాయు కాలుష్యం అధికంగా ఉన్న నేపథ్యంలో వివిధ రాష్ట్రాల్లోని వైద్యారోగ్య శాఖలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ హెచ్చరికలు జారీ చేసింది. శీతాకాలం, పండుగలు సమీపిస్తుండడంతో పాటు, 'వాయు కాలుష్యం తీవ్రతరమై అనారోగ్య పరిస్థితులకు దారితీస్తోందని, ఈక్రమంలో బహిరంగ ప్రదేశాల్లో ఉదయపు నడక, క్రీడలు వంటి వాటికి దూరంగా ఉండాలని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, ట్రాఫిక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఈ ఆందోళనల దృష్ట్యా 'వాతావరణ మార్పు- మానవులపై ప్రభావం' జాతీయ కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించింది. పంట వ్యర్థాలను కాల్చడం, పండగ సమయంలో బాణాసంచా వినియోగం, వ్యక్తిగత వాహనాలపై ప్రయాణించడం, డీజిల్ ఆధారిత జనరేటర్లపై ఆధారపడటం వంటివి తగ్గించడం అతిముఖ్యమైన చర్యలుగా పేర్కొంది. వ్యక్తులు ప్రభుత్వ యాప్ ద్వారా గాలి నాణ్యతను పర్యవేక్షించాలని ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలియజేసింది.

=========================

దానా తుఫాను ప్రభావంతో పశ్చిమ బెంగాల్‌లోని పలు జిల్లాలలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (IMD)వెల్లడించింది. కోల్‌కతా, హౌరా, హుగ్లీ, బంకురా, పురూలియా జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. కాగా పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణాది జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు తీవ్ర తుఫాను డానా తీవ్ర అల్పపీడనంగా మారి, ఈరోజు రాత్రికి అల్పపీడనంగా మారనుందని వాతావరణ శాఖ తెలిపింది.

=========================

పుణె వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండవ టెస్టు క్రికెట్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు రెండవ రోజు అయిన ఈరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ప్రస్తుతం న్యూజిలాండ్  301 పరుగుల ఆధిక్యంలో ఉంది.

===========================

===========================